

# పెళ్ళిచూపులు

**పొన్నాడ సత్యప్రకాశరావు**

సాయంత్రం అయిదు గంటలవుతోంది.

విజయవాడ సూర్యుడు ఇంకా ఆకాశంలో ఎర్రగా వేగుతున్నాడు. జనాలని వేపుకు తింటున్నాడు.

ఇప్పుడు "మండే ఎండాకాలం"లో అన్ని పట్ట ణాలు పేర్లు చూసుకుంటున్నా విజయవాడ— గొప్ప విజయవాడ కుంది. ఇక్కడున్నవి మూడు సీజన్లు...హాట్...హాటర్...హాటెస్ట్.

* * *

క్రొత్త వంతెన దగ్గర బస్సు దిగి దాసరివారి వీథిలోకి మళ్ళింది వైదేహి. చెమటతో మొహం అంతా జిడ్డుగా ఉంది. స్నానం చేసి నీట్‌గా తయారయి బయలుదేరినా సుందరి ఇంట్లో మళ్ళీ టాయిలెట్ అవ్వాలి కాబోలు. అసలే వెళ్ళేది పెళ్ళిచూపులకు కదా! పెళ్ళిచూపులు...? నవ్వొచ్చింది. ఆడదా న్నయ్యుండీ పెళ్ళిచూపులకు తనే వెడుతున్నందుకు. సదరు పెళ్ళికొడుకు ఆరింటికి వస్తానన్నాడట. తనను అయిదింటికల్లా వచ్చేయమన్నారు రాజేశ్వరిగారు, సుందరీ వాళ్ళ అమ్మగారు. ఆవిడే పాపం! తనమీద అభిమానంతో పనికట్టుకుని వాళ్ళింట్లోనే ఏర్పాటు చేసారు ఈ పెళ్ళిచూపులను. వారం రోజుల క్రితం తల్లితో రాజేశ్వరిగారి సంభాషణ గుర్తుకు వచ్చింది.

"ఏంటే వదినా! వైదేహికి బుద్ధిలేక పోతే నీకేమయింది? ముప్పై దాటిపోయాయి. పెళ్ళి ఊసే ఎత్తటం లేదు. నలుగురు తలోమాట అనుకోక ముందే ఆ మూడు ముళ్ళు వేయించేయ్! ఇప్పటికే ఆ అమ్మాయి జీతం పోతుందని పెళ్ళి ప్రయత్నం చెయ్యడం లేదని అనుకొంటున్నారు."

"నీకు తెలియందేముంది వదినా! ఎన్ని చెప్పినా వినటంలేదు. చేను కోవంటోంది. ఆడపిల్ల సంపాదనకాశపడతామా ఎంతలేని వాళ్ళమయినా? తన జీతాన్ని అలాగే బ్యాంక్‌లో వేస్తున్నాం. కట్న కానుకలకు పనికొస్తుందని. విజయ, వినయల డిగ్రీలు కూడా పూర్తయ్యాయి. సంబంధాలు చూడబోతే పెద్ద అమ్మాయికి ఇంకా పెళ్ళెందుకు చెయ్యలేదు అని అడుగుతున్నారు. ఏం చెప్పాలో తోచడం లేదు. నిజానికి అయిదారేళ్ళ క్రితం మా ఆర్థిక స్థితి అంతగా బాగోలేదు. కేవలం కట్నాలదగ్గర వెనుకంజ వేసా...అప్పుడే ఎలాగో అలా ముడిపెట్టెయ్యాల్సింది" అమ్మ జవాబు.

"ఇప్పటికయినా ఏం మించిపోయిందొదినా...ఈ రోజుల్లో ఆడపిల్లలకి సంబంధాలు కుదిరి పెళ్ళిళ్ళు అయ్యేసరికి ముప్పైలు వచ్చేస్తున్నాయి. సరేగాని నువ్వేమి అనుకోనంటే ఒక్కమాట! మా దూరపు చుట్టాల అబ్బాయి ఒకడున్నాడు...హైదరాబాద్‌లో ఏదో బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. వయసు ముప్పై అయిదు లోపే. అయితే రెండో పెళ్ళి...అమ్మాయి సం. క్రితం ఏక్సిడెంట్‌లో పోయిందిట. రెండేళ్ళ పాప ఉంది. ముఖ్యంగా ఆ పాపను సాకటానికి ఓ తల్లి కావాలి. కట్న కానుకల ప్రసక్తి లేదు. అబ్బాయి వైదేహికి సరైన జోడీయే. రెండో పెళ్ళన్న మాటేగానీ... నువ్వు బాధపడనంటే మరోమాట. వైదేహికి ఇదివరలో ప్రేమ వ్యవహారమేదో బెడిసి కొట్టిందని అందుకే సంబంధాలు ఏవీ కుదరటం లేదని ఎవరో అంటె విన్నా...నిజానిజాలేమయినా నే చెప్పిన సంబంధం గురించి ఆలోచించు. వస్తా" అని వెళ్ళిపోయారావిడ.

ఆవిడని సాగనంపి లోనికొచ్చిన ఆవిడ వైదేహిని చూడగానే తమ మాటలు విన్నదేమోనని కంగారుపడింది. ఆమె తేరుకోకముందే రాజేశ్వరిగారు చెప్పిన సంబంధం సెటిల్ చెయ్యమ్మా అనేసరికి ఆవిడ ఆనందానికి అంతులేకుండా పోయింది. పెళ్ళిచూపులాంటివేమీ వద్దంది. తనకు పెళ్ళి కాకపోవటం చెల్లెళ్ళకు అవరోధం కాకూడదు. అందుకే తనకు పెళ్ళి కావాలి. అయితే రాజేశ్వరిగారి అమ్మాయి తన బెస్ట్‌ఫ్రెండ్ అయిన సుందరి ఒప్పుకోలేదు. "పెళ్ళి చూపులంటూ ఆర్భాటాలేం చెయ్యం. మా ఇంటికి ఓ సాయంత్రం అతన్ని రమ్మంటాను. మువ్వురా...ఇద్దరూ మాట్లాడుకుని నిర్ణయించుకోండి" అంది. సరే నంది.

* * *

సుందరి ఇంటికి చేరుకునేసరికి

"ఏమిటే ఇంత లేటు...ఎండలో రావాలి కదాని నిన్ను ఉదయమే వచ్చేయమన్నాను కదా...చెమట్లు చూడు... పద మళ్ళీ తయారవుదువుగాని" అంటు చివాట్లు పెట్టింది సుందరి.

"వృద్ధ కన్యకీముస్తాబు చాల్లే" అన్నది వైదేహి.

"నీ మొహం! నీకు ముప్పై రెండేళ్ళంటే ఎవరూ నమ్మరు. ఇంకా కాలేజీ గర్ల్‌లా ఉంటావు. అసలు సంతూర్ సోప్ వాళ్ళు నిన్ను చూసి వుంటే వదలరు. టాప్ మోడల్‌వి అయిపోయుండేదానివి పద పద..." అంటూ బాత్‌రూమ్‌లోకి తోసింది. టాయిలెట్ అయి వచ్చేసరికి కూల్‌డ్రింక్‌తో రెడీగా సుందరి... డ్రింక్ త్రాగుతూ ఈ పెళ్ళిచూపుల గతంలోకి జారుకున్నది. సుమారు ఆరేళ్ళు వెనక్కి...

* * *

అవి వైదేహి స్టాఫ్ సెలక్షన్ కమీ

షన్ పాసయ్యి ఎల్.డి.సి.గా జాయిన్ అయిన రోజులు. వైదేహి తండ్రి ఓ ఎన్.జి.ఓ. ప్రిన్సిపల్డ్ మనిషి. ప్రిన్సిపల్స్ వున్నచోట పల్స్ వేగం కొట్టుకోవటం తప్ప పర్స్ ఇనందుగా ఉండదని వేరే చెప్పనక్కర్లేదు. వైదేహికి ఇద్దరు చెల్లెళ్ళు. విజయ ఇంటర్, వినయ టెన్త్ చదువుతున్నారు. వైదేహికి ఇరవై ఆరేళ్ళు. బియస్సీ పూర్తయినప్పట్నుంచి సంబంధాలు వెతుకుతున్నారు. ఆమె అందం, వ్యక్తిత్వం, ఆ కుటుంబ సాంప్రదాయం ఇవేవి కట్నం కన్నా గొప్ప కావని తేలేసరికి కొంచెం టైము పట్టింది. ఆమె ఒక్కర్తె అయితే ఎలాగో అలా అన్నీ తాకట్టుపెట్టైనా కోరిన కట్నం ఇచ్చుకొని పెళ్ళి జరిపించేసేవారు. ఆమె వెనుక ఇంకా చదివించి, కట్నమిచ్చి పెళ్ళి చెయ్యాల్సిన చెల్లెళ్ళున్నారు. ఆమె తండ్రి వెనుక ఏమి లేదు. డిగ్రీ అయినప్పటి నుంచి కాన్వెంట్‌లో టీచర్‌గా పనిచేస్తూ తండ్రికి చన్నీళ్ళు అందించేది. గవర్నమెంట్ జాబు కట్నంలో డిస్కౌంట్ తెస్తుందంటె కష్టపడి కాంపిటీటివ్ ఎగ్జామ్స్ వ్రాసి జాబు సంపాదించుకుంది. అయినా సంబంధాలు కుదరటం లేదు. ఆ సమయంలో కిషోర్‌తో పరిచయమయింది. ఆమె ఆఫీసు క్రిందనే అతని బ్యాంక్. కిషోర్ బాగానే వుంటాడు. ఆమెకన్న రెండేళ్లు పెద్ద. కలిగిన కుటుంబం. పరిచయం నెమ్మది నెమ్మదిగా ప్రణయానికి దారితీసింది. ఒకసారి ఆమె ఇంటికి కూడా వెళ్ళాడు. తల్లిదండ్రులకి పరిచయం చేసింది. తమ ప్రేమ విషయం కిషోర్ వైదేహి తండ్రితో చెప్పటం...ఆయన కిషోర్ తల్లిదండ్రులతో మాట్లాడాలనుకోవటం జరిగింది. ఇంతలో కిషోర్ బంధువులెవరో పోవటం... ఆ కుటుంబానికి ఏవో చికాకులు కలగటంతో పెళ్ళి విషయం కదపటానికి కొంతకాలం ఆగమని కిషోరే సలహా ఇచ్చాడు వైదేహి తండ్రికి. ఇంతలో ఇద్దరికీ పరిచయమున్న ఓ కొలీగ్ పెళ్ళికి తిరుపతి వెళ్ళారు కిషోర్, వైదేహిలు. బయలుదేరినప్పటి నుంచి ముసురుగానే వుంది. కిషోర్ సాయం ఉంటాడనుకుని ఆమె తల్లీ తండ్రీ పంపించారు. ఆఫీసు నుంచి ఇంకో నలుగురు కొలీగ్స్ కూడా బయలుదేరారు. తీరా పెళ్ళి అయ్యేసరికి ముసురు కాస్తా తుఫాన్‌గా మారింది. కొలీగ్స్ చాలామంది తిరుమలకని తెల్సిన వాళ్ళ ఇళ్ళకని చెల్లాచెదురై పోయారు. కిషోర్, వైదేహిలు ఇద్దరే మిగిలారు. వైదేహి భయపడసాగింది. తుఫాన్ పెద్దదవ్వకుండా వెళ్ళిపోదాం అంది కిషోర్‌తో ఇద్దరూ తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. వెంటగిరి వరకు వెళ్ళిన తిరుమల తిరిగి తిరుపతికి వచ్చేసింది. నెల్లూరు దగ్గర తుఫాన్ బీభత్సాన్ని సృష్టించడంతో ట్రెయిన్స్ రెగ్యులేట్ చేసారుట. తిరుపతి చేరేసరికి రాత్రి పదకొండవుతోంది. వేరే బంధువులెవ్వరు లేరు. పెళ్ళి వారిల్లు చాలా దూరం. అయినా వారి ఇబ్బందులు వారికుంటాయి. ఏదైనా లాడ్జికెడదాం అని కిషోర్ అనేసరికి వేరే దారిలేక ఒప్పకుంది. భగవంతునిపై భారం వేసి. మిస్టర్ యండ్ మిసెస్ కిషోర్‌గా రిజిష్టర్‌లో సంతకంచేసి రూం చేరుకున్నారు. సింగిల్ రూమ్స్ వేరు వేరుగా తీసుకొందాం అనుకొంది వైదేహి కాని లాడ్జిలో ఒంటరిగా గదిలో ఉండటానికి భయమేసి కిషోర్‌మీద నమ్మకంతో డబుల్ రూంకి ఒప్పకుంది.

అది ఖరీదైన లాడ్జి. విండో తెరచి చూడసాగింది. నాలుగో అంతస్తులో వుంది వాళ్ళ రూం. బయట కుంభవృష్టి ఉరుములు, మెరుపులు...ఆ భయంకరమైన వాతావరణం కూడా అంత పైనుంచి చూస్తే ఎంతో అందంగా వుంది. ఇంతలో ఓ విసురుగాలి, జల్లు పోటీపడి ఆమె ఒంటిని తాకాయి. అప్పటి వరకు సగం సగం తడిసిన ఆమె చీరె పూర్తిగా తడిసిపోయి వొంటికి పూర్తిగా అతుక్కుపోయింది. దగ్గర్లో పెద్ద శబ్దంతో పిడుగుపడటం విండో మూసివేసి ఆమె వెనుకకు తిరిగి విండోలోంచి వంగి క్రిందకు చూస్తున్నప్పుడు ఆమె నడుంమీద పడ్డ ముడతనే చూస్తూ



వుండిపోయిన కిషోర్ ఒక్కసారి తత్త రపడ్డాడు. చూపు మరల్చుకున్నాడు. అతను అప్పటికే బట్టలు మార్చుకుని బనీను, లుంగీలో ఉన్నాడు. తెలుగు సినిమాలు గుర్తుకొచ్చాయి వైదేహికి. మొదటిసారిగా కిషోర్‌పై అనుమానం కలిగింది. ఎంతటి వాడినైనా బల హీనున్ని చేసే బలవంతమైన క్షణా లవి. ఆమెది నిస్సహాయ స్థితి. తన నమ్మకాన్ని వమ్ము చేస్తాడా...భయంతో అదురుతున్న గుండెలతో టాయ్‌లె ట్‌లోకి వెళ్ళింది చీరె మార్చుకోవడా నికి. సరిగ్గా జిప్ వెయ్యకపోవటంవలనో ఏమో బ్యాగ్‌లోని బట్టలు కూడా కొద్దిగా తడిసిపోయాయి. అయినా తప్పదు. మార్చుకుని వచ్చింది. స్కఫ్ కలర్ జాకెట్, వైట్ శారీ మీద పూలు... అవికూడా తడిగా వుండటంవలన అందాలను దాచలేక పోతున్నాయి. ఒంటికి అతుక్కుపోవటంవలన శిల్పం చెక్కటానికి ముందు శిల్పి గీసు కున్న స్కెచ్‌లా ఉందామె. ఆ జాకెట్ కలర్ పలుచని, పచ్చని మధ్యప్రదేశాన్ని మరింత గ్లామరస్ చేస్తోంది. కిషో ర్‌లో ఏదో సంఘర్షణ మొదలైందని అతని చూపులు ఆమెకు చెబుతు న్నాయి. ఒక సింగిల్ కాట్‌ని దూరంగా జరిపి దుప్పటి కప్పుకుని అటువైపు తిరిగి పడుకొంది వైదేహి. ఉరుములు, పిడు గులు ఆమెని భయపెడుతున్నాయి. నిద్ర పట్టడం లేదు. లేచి కూర్చొని కిషోర్‌వైపు చూసింది ఏంచేస్తున్నాడోన నుకుంటూ. ఆమెవైపే చూస్తున్న కిషోర్ ఏదో నిర్ణయించుకున్న వాడిలా తన కాట్‌ని ఆమె కాట్‌కి జోడించి ఆమె పక్కనే కూర్చున్నాడు. బెదురుగా చూస్తున్న ఆమెతో "నామీద నమ్మకం లేదా? భయమెందుకు? వెళ్ళగానే మా వాళ్ళకు చెప్పి ముహూర్తాలు పెట్టిస్తాను. తోడు నిజంగా అవసరమైన రాత్రి ఇది. తొలిరాత్రిలో ఈ వాతావరణం రమ్మన్నా రాదు. నాకు ఇలా వుంటే ఎంతో ఇష్టం. ఇదే మన తొలిరాత్రి అనుకొందాం...కాదనకు ప్లీజ్" అంటూ దగ్గరకు తీసుకున్నాడు. దూరంగా జరి గిపోదామనుకొంది. ఒక ప్రక్క ఒక భయం...మరోప్రక్క మరో భయం..." వద్దు" అనటానికి పెదవులు విచ్చుకో బోయాయి. కాని వాటిని అతని పెద వులు విచ్చుకోనివ్వలేదు. అయిష్టంగానే లొంగిపోయింది.

* * *

ఆ మర్నాడు రాత్రి బయలుదేరి వచ్చే సారు. కిషోర్ మునుపటిలాగే పలుకరి స్తున్నాడు కాని ఏదో తేడా కనిపిస్తోంది. భ్రమపడుతున్నానేమో అనుకోసాగింది వైదేహి. అతను మంచివాడేనా, మోసం చెయ్యడు కదా అని ఆలోచించసా గింది. ఒకరోజు తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్పానని మీ వాళ్ళనొచ్చి మాట్లా డమని చెప్పాడు. ఇంతలో వైదేహి తల్లికి టైఫాయిడ్. తగ్గేసరికి నెలపైనే పట్టింది. కిషోర్ వాళ్ళతో మాట్లాడమని తొంద రపెట్టింది తల్లిని. ఆమె పీరియడ్ మిస్ అవ్వటం తల్లి గమనించి రెట్టించి అడిగింది. జరిగింది చెప్పి ఏడ్చేసింది. తల్లి తిట్టింది.. కొట్టింది. అయినా తల్లి కదా కడుపులో దాచు కుంది. భర్తకి చెప్పి తొందరగా కిషోర్ వాళ్ళతో మాట్లాడమని పంపించింది. మాట్లాడటానికి వెళ్ళి వచ్చిన తండ్రి మొహం చూసేసరికి వైదేహి గుండె జారిపోయింది. పెళ్ళి చేసుకోవాలంటే తాహతుకు మించిన కట్నం అడిగా రట. వైదేహి నెల తప్పిన విషయం కూడా చెప్పి బ్రతిమాలుకుంటే "పెళ్ళికి ముందే ఒంటరిగా పరాయి మగాడితో ఊరుకెళ్ళిన ఆడది ఇంకెంతమందితో తిరిగిందో... మా వాడికి బోలెడు కట్న మిస్తామని సంబంధాలు వస్తున్నాయి. అడిగిన కట్నం ఇస్తే చేసుకోవడానికి అభ్యంతరం లేదు. ఎందుకంటే మా కిషోర్ కూడా అమ్మాయితో తిరగడం తప్పు కాబట్టి" అంటూ నిర్దయగా మాట్లా డింది కిషోర్ తల్లి. ఇంట్లోనే వుండి మొహం చాటేసాడట కిషోర్.

మర్నాడు కిషోర్‌ని నిలదీద్దామని బ్యాంక్‌కి వెళ్ళిన వైదేహికి కిషోర్ లీవు పెట్టినట్టు తెలిసింది. వారం రోజు లైన తరువాత వెడితే లీవు ఎక్స్‌టెండ్ చేసినట్టు, హైదరాబాదుకు ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈలోగా ప్రెగ్నెన్సీని కన్‌ఫర్మ్ చేసింది లేడీ డాక్టర్. ఉన్నదంతా ఊడ్చి కిషోర్ వాళ్ళు అడిగిన కట్నం ఇవ్వ డానికి సిద్ధమయ్యారు వైదేహి తల్లిదం డ్రులు. కాని వైదేహి ఒప్పుకోలేదు ఆ మోసగాడిని జీవితాంతం భరించడానికి పోనీ అబార్షన్ చేయిస్తామన్నారు. తన పొరబాటుకు ఇంకో ప్రాణి బలి కావటం ఇష్టంలేక దానికీ వద్దంది. మరి ఎలాగే? అంటూ వెక్కి వోరు బాదుకుంది తల్లి. ఢిల్లీలో వుంటున్న ప్రాణ స్నేహితురాలు భావన గుర్తుకు వచ్చింది. డిగ్రీలో వైదేహి క్లాస్‌మేట్. డిగ్రీ కాగానే పెళ్ళిచేసుకుని భర్తతో ఢిల్లీ వెళ్ళిపోయింది. పిల్లలు లేరు. సంప్ర దిస్తే ఏదో లోపం వుందని, ఆమెకి పిల్లలుపుట్టే అవకాశం లేదని చెప్పే సారు డాక్టర్లు. ఎవరైనా అనాథను పెంచుకునే ఉద్దేశంలో వున్నానని ఈ మధ్యనే వ్రాసిందామె. తన సంగతి చెబితే తన బిడ్డనే ఎందుకు పెంచు కోదు? వెంటనే ఢిల్లీ బయలుదేరి వెళ్ళింది. పరిస్థితిని ఎంతో సాను భూతితో అర్థం చేసుకుంది. వైదేహి నిర్ణయాన్ని మెచ్చుకొని వైదేహి బిడ్డకు తల్లినౌతానంది భావన. ఆమె భర్త గెజిటెడ్ ఆఫీసరు. ఆయనా ఒప్పుకు న్నారు. వైదేహి చేత లీవు పెట్టించి తన ఇన్‌ఫ్లుయెన్స్‌తో ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ చేయించారు. వాళ్ళ ఇంట్లోనే వుండి పండంటి మగ పిల్లవాడిని ప్రసవిం చింది వైదేహి. కాలం గడుస్తోంది. కొడుకు చేత ఆంటీ అని పిలిపిం చుకోవడం కష్టంగా వుంది. అయినా తప్పదు. చెల్లెళ్ళ భవిష్యత్ ఆమె మమ తకు అడ్డు తగులుతోంది. అయినా ఎలాగో అలా తన బిడ్డ దగ్గరే వున్నా నన్న తృప్తితో బ్రతుకుతోంది. అప్పుడ ప్పుడు అమ్మా నాన్నలను, తోబుట్టువు లను చూసి మళ్ళీ ఢిల్లీ వెళ్ళిపోయేది. విషయాన్ని రహస్యంగానే దాచగలిగారు. ఆమె దూరంగా వుండడంతో ఎవ్వ రికి ఎక్కువగా తెలిసే అవకాశం లేకుండా పోయింది. కొంతమం దికి ఏదైనా అనుమానమున్నా ఆమె దగ్గర లేకపోవడంతో మరుగున పడిపోయింది. చెల్లెళ్ళు డిగ్రీలలోకి రావడం, తల్లి ఆరోగ్యం బాగోకపో వడం వలన వైదేహికి తిరిగి విజయ వాడ వెళ్ళిపోదామా అన్పించసాగింది. కాని పుత్రప్రేమ అడ్డుపడేది. "చూడు వైదేహి... వీడి మీద ఎక్కువగా మమత పెంచుకోవద్దు. వీడు నా కొడుకే.. నీతి అన్నది మగవా డికైనా ఆడదానికైనా ఒకటే... నిన్ను మోసం చేసిన కిషోర్ ఎవరైనో కట్టు

యర్రంశెట్టి శాయి

కొత్త సీరియల్

త్వరలో



కొని కులుకుతూనే వుంటాడు. నువ్వెందుకిలా మోడులా వుండాలి. మళ్ళీ విజయవాడ వెళ్ళిపో. పెళ్ళి చేసుకుని హాయిగా వుండు. వీడిని చూడాలనుకున్నప్పుడు రా. లేదా నేనే తీసుకొస్తూ వుంటాను" అని నచ్చచెప్పింది భావన. మళ్ళీ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం చేసుకొని విజయవాడ వచ్చేసింది. గతాన్ని మరచిపోయి హాయిగా బ్రతకసాగింది. కాని పెళ్ళి చేసుకునే ఉద్దేశం మాత్రం ఎంతమాత్రం లేదు. కాని తను పెళ్ళి చేసుకోకుండా వుండడం... అందం, ఉద్యోగం అన్నీ వుండి, ఏవేవో ఊహాగానాలకు దారితియ్యడమే కాకుండా చెల్లెళ్ళ కొచ్చే సంబంధాలు బెడిసి కొడుతున్నాయి.

* * *

"ఏమిటే ఆలోచిస్తున్నావు... వద్దు వద్దని పెళ్ళి అనగానే ఊహల్లోకి జారిపోయావే" సుందరి కుదుపుకి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చింది వైదేహి. "ఆరు గంటలు దాటింది. ఇంకా రాలేదేమిటి. చూసొస్తామండు" అంటూ బయటకు వెళ్ళింది సుందరి. వైదేహిని మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి.

రెండో పెళ్ళివాడనేసరికి ఆమెలో ఆశలు చిగురించాయి. కొంతకాలం భార్యతో సుఖించి బిడ్డను కని విధివశాత్తు భార్యను కోల్పోయి బిడ్డ సంరక్షణార్థం రెండో పెళ్ళికి సిద్ధపడిన వ్యక్తికి కూడా అనాఘ్రాత పుష్పమే కావాలా? కేవలం ఒక్క రాత్రి జరిగిన పొరబాటును మన్నించలేడా? మగవాళ్ళందరూ కిశోగాలేనా? మంచివాళ్ళుండరా? తన బిడ్డకు నేను తల్లినౌతాను. నా బిడ్డకు తను తండ్రి కాలేడా? అతనికి తన విషయం చెప్పి ఒప్పించి తన బిడ్డను కూడా తెచ్చుకోవచ్చు. నిన్ననే భావనతో కూడా ఢిల్లీకి ఫోన్ చేసి మాట్లాడడం జరిగింది. అతి కష్టం మీద బిడ్డను ఇచ్చివెయ్యడానికి ఒప్పుకొంది కానీ బాధపడుతోంది. అడిగి చూడు... ఒప్పకుంటే ఆలోచిద్దాం. తన స్వార్థం పెంచిన మమకారాన్ని కూడా లెక్కచెయ్యడం లేదు.

"ఏయ్ మొద్దు... అతనొచ్చాడు... మళ్ళీ ఊహల్లోకి జారిపోయావా? కలలని నిజం చేసుకునే అవకాశం వచ్చింది... మనిషి రెండో పెళ్ళివాడిలా లేదు. వెళ్ళు. మాట్లాడు" అంటూ డ్రాయింగ్ రూంలోకి తోసింది వైదేహిని సుందరి.

అతడిని చూసిన వైదేహికి నోట మాట రాలేదు.

అతను కిషోర్...

నిశ్శబ్దం వికటాట్టహాసం చేసింది. ఆమెలో పెల్లుబికిన అసహ్యం, జుగుప్స ఆమె తలరాతను చూసి నవ్వుకున్నాయి. ఆమె మొదటి పెళ్ళిని చెడగొట్టిన కిషోర్ ఆమెను రెండో పెళ్ళి చేసుకోవడానికి వచ్చాడు. ఆమెకు ఏడుపు కన్నా నవ్వొచ్చింది. జీవితంలో ఎప్పుడూ నవ్వనంతా పగలబడి నవ్వింది. భయం...భయంగా చూశాడు కిషోర్.

"ఏరా? నీ పాపం నీ భార్యను పొట్టన పెట్టుకుంది. పెళ్ళాం లేకుండా బ్రతకలేవా? పిల్లాడికో ఆయాను పెట్టుకో వచ్చుగా! అయినా ఎవరితోనో తిరిగి కడుపు తెచ్చుకొన్నది రెండో పెళ్ళికి పనికొస్తుందా? తండ్రెవరో తెలియని బిడ్డకు తండ్రివవుతావా?" ఉద్రేకంతో... అసహ్యంతో ఊగిపోతోంది వైదేహి.

"క్షమించు వైదేహి. అప్పుడు నేనెంత చెప్పినా అమ్మ వినలేదు. నువ్వు నిప్పులాంటిదానివని నాకు తెలుసు. ఏడీ మన బిడ్డ? ఆ తప్పకు నాకు శిక్ష విధించాడు. ఇప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకుంటాను" ఇంకా ఏదో అనబోయాడు కిషోర్.

"షటప్ అండ్ గెటవుట్... నీలాంటి స్వార్థపరుడికి, వెన్నెముక లేని మగవాడికి మొదటి పెళ్ళాం కావందుకే సంతోషిస్తూంటే నీకు రెండో పెళ్ళాంగా రావడం కూడానా? నేను నిప్పలాంటి దాన్నని అప్పడెందుకు చెప్పలేదు? నా మీద మోజు తీరిపోయింది. మంచి కట్నం తీసుకొచ్చిన దాన్ని పెళ్ళిచేసుకున్నావు. రేపు నేను ఛస్తే ఇంకొకర్తిని చేసుకుంటావు. ఆడదంటె అంత లేలికగా వుందా? చూస్తుంటే నాకు ఇంకా పెళ్ళి కాలేదని తెలిసి నన్నేదో ఉద్ధరించాలనుకుని నువ్వే రాజేశ్వరిగారికి ప్రపోజ్ చేసావేమో అనిపిస్తోంది. ఇంకెవడికైనా మూడో పెళ్ళాంగా అయినా కోరి వెడతా... లేదా ఇలాగే వుండిపోతా! నిన్ను మాత్రం క్షమించను. గెటవుట్ స్కౌండ్రల్" గట్టి అరచి కూలబడిపోయింది వైదేహి ఏడుస్తూ...

●●

# ఈ వారం అబద్ధాలు



'నేషనల్ ఫ్రంట్'కు తెలుగు అనువాదమే 'భారతదేశం'

– 'ఫ్రంట్' ఛైర్మన్ ఎన్టీయార్

సేకరణ: పందల జయరాం, బెంగుళూరు

(*'ఆంధ్రజ్యోతి' 12-8-95*)

"అల్‌ఫరాన్ హంతకుల సంస్థ కాదు. చంపడంలో మాకు ఆనందం లేదు."

–అల్‌ఫరాన్ ప్రతినిధి

సేకరణ: ఒ. మాధవి, దాదిరెడ్డిపల్లి, కడపజిల్లా

(*'ఈనాడు' 14-8-95*)



"అస్పృశ్యత అనేది ఇస్లాం మతం సృష్టించిందే"

– వి.హెచ్.పి. నేత అశోక సింఘాల్

సేకరణ: డి. నబెన్న, చైతన్య విద్యా విహార్, బేస్తవారపేట-523 334, ప్రకాశం జిల్లా.

(*'ఆంధ్రభూమి'*)



"కేంద్ర రాజకీయాలలో ఎదగాలనీ, ప్రధాని కావాలనీ ఎన్టీయార్‌కి ఏ కోశానా లేదు... మా ఇద్దరి స్వభావమూ ఒక్కటే, పదవుల మీద వ్యామోహం లేదు."

– లక్ష్మీపార్వతి

సేకరణ: వి. సూర్యనారాయణ, ఎస్.వి.యు. క్యాంపస్, తిరుపతి.

(*'ఈనాడు' 22-8-'95*)



"రామన్న లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్(ఐ) ఆంధ్రప్రదేశ్‌లో 30 స్థానాలను గెల్చుకుంటుంది"

– కాంగ్రెస్ (ఐ) అసోసియేట్ సభ్యుడు పి. ఉపేంద్ర

సేకరణ: ఎం.ఎస్. మాధవరావు, గుడ్లవల్లేరు, కృష్ణాజిల్లా

(*'ఆంధ్రజ్యోతి' 23-8-95*)



"మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కావడం నాకే మాత్రం కష్టమైన పని కాదు. కాకపోతే, ముఖ్యమంత్రి పదవి నా కిష్టం లేదు"

– 'శివసేన' నేత బాల్‌థాకరే

సేకరణ: మాలిక్ కందుకూరు

(*'ఈనాడు' 21-8-'95*)